రాజ్యసభ సభ్యురాలిగా సోనియా ప్రమాణం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 4: కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ, రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ సహా 14 మంది గురువారం రాజ్యసభ సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు. రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌కర్ వారి చేత ప్రమాణం చేయించారు. తొలిసారిగా రాజ్యసభలో అడుగుపెడుతున్న సోనియా గాంధీ రాజస్థాన్ నుంచి, అశ్వినీ వైష్ణవ్ ఒడిశా నుంచి రాజ్యసభ సభ్యులుగా ఎన్నికయ్యారు. ప్రమాణ స్వీకారం చేసిన వారిలో తెలంగాణకు చెందిన బీఆర్ఎస్ నేత రవిచంద్ర వద్దిరాజు, ఏపీకి చెందిన వైఎస్ఆర్‌సీపీ నేతలు గొల్ల బాబురావు, మేడా రఘునాథ రెడ్డి, యెర్రం వెంకట సుబ్బారెడ్డి ఉన్నారు.

'తల్లి ఒత్తిడి వల్లే రాజకీయాల్లోకి రాహుల్'

న్యూఢిల్లీ, ఏప్రిల్ 4: రాహుల్ గాంధీ, ప్రియాంక ఇద్దరూ కేవలం వారి తల్లి సోనియా గాంధీ బలవంతం మీదనే రాజకీయాల్లోకి వచ్చారని ప్రముఖ సినీ నటి, బీజేపీ ఎంపీ అభ్యర్థి కంగనా రనౌత్ కామెంట్ చేశారు. ఇటీవల బాగా పాపులరైన త్రీ ఇడియట్స్ సినిమాలో చూపిన ట్టుగా కుటుంబ సభ్యుల వల్ల పిల్లలు ఇబ్బంది పడినట్టే రాహుల్, ప్రియాంక కూడా అదే పరిస్థితి ఎదుర్కొంటున్నారని కంగనా చెప్పారు. తన ఇష్టాలు వేరే అయినప్పటికీ రాహుల్ రాజకీయాల్లో నటించాల్సి వస్తున్నదని, ఆయన నటనను వృత్తిగా చేసుకుని ఉంటే బాగా రాణించి ఉండేవాడని వ్యంగ్యంగా అన్నారు.

పామునైనా నమ్మొచ్చు.. బీజేపీని నమ్మలేం

కోల్‌కతా, ఏప్రిల్ 4: విషపూరిత పామునైనా నమ్మొచ్చు.. కానీ బీజేపీని మాత్రం నమ్మొద్దు.. అంటూ బెంగాల్ ప్రజలను సీఎం మమతా బెనర్జీ హెచ్చరించారు. గురువారం ఎన్నికల ర్యాలీలో ఆమె ప్రసంగిస్తూ, కేంద్ర దర్యాప్తు సంస్థలు సహా బీఎస్ఎఫ్, సీఐఎస్ఎఫ్ కూడా బీజేపీ ప్రయోజనాల కోసం పనిచేస్తున్నాయని, ఎన్నికల నిబంధనల్ని బీజేపీ తుంగలో తొక్కుతున్నదని ఆరోపించారు. ఈ ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలకు సమాన అవకాశాలు ఉండేట్టు చూడాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని కోరారు. కేంద్ర దర్యాప్తు సంస్థల బెదిరింపులకు టీఎంసీ లొంగదని మమత తేల్చిచెప్పారు.

మళ్లీ బీజేపీ నెగ్గితే జార్ఖండ్‌కు అథోగతే

హజారీబాగ్, ఏప్రిల్ 4: కేంద్రంలో బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే జార్ఖండ్‌ను వెనుకబాటుకు గురిచేస్తుందని మాజీ సీఎం హేమంత్ సోరేన్ భార్య కల్పనా సోరేన్ ఆరోపించారు. హజారీబాగ్‌లో జేఎంఎం పార్టీ 45వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకల్లో ఆమె ప్రసంగించారు. బీజేపీకి జార్ఖండ్ అంటే అస్సలు ఇష్టముండదని, ఆ రాష్ట్ర ప్రజలను వారు అసహ్యించుకుంటారని ఆమె ఆరోపించారు. 'వారికి మనం నచ్చం. మన ఆత్మ గౌరవం నచ్చదు. మన పిల్లలు విదేశాలు వెళ్లి చదువుకోవడం నచ్చదు' అని ఆమె విమర్శించారు. అలాంటి బీజేపీకి ఈ ఎన్నికల్లో గట్టిగా బుద్ధి చెప్పాలని ఆమె కోరారు.

మహారాష్ట్ర ఎంపీ నవనీత్ కౌర్‌కు ఊరట

న్యూఢిల్లీ: బాలీవుడ్ మాజీ నటి, మహారాష్ట్ర ఎంపీ నవనీత్ కౌర్ రాణాకు సుప్రీం కోర్టులో గొప్ప ఊరట లభించింది. అమరావతి ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గం నుంచి బీజేపీ టికెట్‌పై పోటీ చేసేందుకు ఆమెకు మార్గం సుగమం అయింది. ఆమె కుల ధ్రువీకరణ పత్రాన్ని రద్దు చేస్తూ గతంలో హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీం కోర్టు గురువారం తోసిపుచ్చి, ఆమె సర్టిఫికెట్‌ను పునరుద్ధరించింది. 2021లో బాంబే హైకోర్టు ఆమె కుల ధ్రువీకరణ పత్రాన్ని రద్దు చేసింది. దీనిపై ఆమె సర్వోన్నత న్యాయస్థానంలో అప్పీలు చేశారు. కోర్టు తీర్పు నేపథ్యంలో గురువారం ఆమె నామినేషన్ వేశారు.

సీబీఐ డైరెక్టరూ బీజేపీ టికెట్‌పై పోటీ చేస్తారేమో!

కోల్‌కతా: లోక్‌సభ ఎన్నికల్లో 400 సీట్లు సాధిస్తామని చెప్తున్న బీజేపీ ఎందుకు భయపడుతున్నదని, హేమంత్ సోరేన్, కేజ్రీవాల్‌ను ఎందుకు అరెస్టు చేసిందని తృణమూల్ కాంగ్రెస్ నేత మహువా మొయిత్ర ప్రశ్నించారు. తన కోసం ఈడీ, సీబీఐ వచ్చినా తాను భయపడబోనన్నారు. బీజేపీ హయాంలో తాను ఎంపీగా బహిష్కరణకు గురికావడం అంటే తనకు గౌరవ బ్యాడ్జి ఇచ్చినట్టేనని పేర్కొన్నారు. బెంగాల్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా తీర్పులు ఇచ్చిన హైకోర్టు జడ్జి ఇప్పుడు బీజేపీతో ఉన్నారని, తర్వాత సీబీఐ డైరెక్టర్ వీఆర్ఎస్ తీసుకొని బీజేపీ టికెట్‌పై పోటీ చేయవచ్చేమోనన్నారు.

ఓటరు కార్డు లేకున్నా ఓటేయొచ్చు

ఈసీ మార్గదర్శకాలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 4: అర్హుడైన ఏ ఒక్క భారత దేశ పౌరుడు కూడా ఓటరు కార్డు లేదన్న కారణంతో ఓటు వేసే హక్కును కోల్పోరాదని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. ఈ మేరకు రాష్ట్ర పోలింగ్ అధికారులకు కొన్ని మార్గదర్శకాలు జారీ చేసింది. ఓటరు కార్డులో అచ్చు తప్పులు, క్లరికల్ దోషాలు ఉన్నా వాటిని విస్మరించి ఓటు వేసే హక్కును కల్పించాలని ఆదేశించింది. ఒక వేళ ఓటరు కార్డులోని ఫొటో సరిపోలకపోతే ఓటరు మరో ప్రత్యామ్నాయ ఫొటో డాక్యుమెంట్‌ను ఆధారంగా చూపి తమ ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం ఇవ్వాలని సూచించింది. అలాగే ఓటు హక్కును వినియోగించుకోవడానికి ఓటరు ఐడీ కార్డును లేని వారు, లేదా తీసుకురాని వారు ప్రత్యామ్నాయ ఫొటో ఐడెంటిటీ పత్రాన్ని తమ గుర్తింపుగా చూపవచ్చునని తెలిపింది.

కాంగ్రెస్‌లో ఐదు అధికార కేంద్రాలు

బహిష్కృత నేత నిరుపమ్

ముంబయి, ఏప్రిల్ 4 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పార్టీలో ఐదు అధికారిక గ్రూపులున్నాయని మాజీ ఎంపీ సంజయ్ నిరుపమ్ ఆరోపించారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని ఆరోపిస్తూ ఆయనను ఆరేండ్ల పాటు పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. అయితే తాను పార్టీకి రాజీనామా చేసిన తర్వాత తనను తొలగించారని నిరుపమ్ ఆరోపించారు. ఐదు కేంద్రాల్లో మొదట సోనియా, తర్వాత రాహుల్, ప్రియాంక, నాలుగో స్థానంలో అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, ఐదో స్థానంలో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఉన్నారని వెల్లడించారు.

చైనా చొచ్చుకొస్తుంటే.. మోదీ మొద్దు నిద్ర: ఖర్గే

జైపూర్: ప్రధాని మోదీ 'అబద్ధాలకోరుల సర్దార్' అని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. భారత భూభాగంలోకి చైనా చొరబడిన సమయంలో ఆయన నిద్రపోతున్నారని మండిపడ్డారు. రాజస్థాన్‌లోని చిత్తోడ్‌గఢ్‌లో గురువారం జరిగిన కాంగ్రెస్ ఎన్నికల ప్రచార సభలో ఖర్గే ఈ ఆరోపణలు చేశారు. మోదీ మన దేశం గురించి ఆలోచించడం లేదని, కేవలం గాంధీ కుటుంబీకులను దూషించడంలో తీరిక లేకుండా గడుపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

అమేథీ నుంచి రాబర్ట్ వాద్రా పోటీ?

అమేథీ: ప్రియాంక గాంధీ భర్త, రాబర్ట్ వాద్రా రాజకీయ రంగప్రవేశం చేయనున్నట్టు తెలుస్తున్నది. ఉత్తరప్రదేశ్‌లోని అమేథీ నుంచి పోటీ చేసేందుకు ఆయన ఆసక్తి చూపిస్తున్నట్టు సమాచారం. 'నేను పోటీ చేస్తే.. అమేథీకి ప్రాధాన్యమిస్తా. రాజకీయాల్లో నా తొలి అడుగులు అమేథీ నుంచే ఉండాలి' అని ఆయన గురువారం ఏఎన్ఐతో అన్నారు. అమేథీ.. గాంధీ కుటుంబ సభ్యుడిని కోరుకుంటున్నదని వాద్రా తెలిపారు. ఇప్పటి వరకు అమేథీ స్థానానికి కాంగ్రెస్ అభ్యర్థిని ప్రకటించలేదు.

యూఏపీఏ, పీఎంఎల్‌ఏను రద్దు చేస్తాం: సీపీఎం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 4: లోక్‌సభ ఎన్నికలను పురస్కరించుకుని సీపీఎం గురువారం తన మ్యానిఫెస్టోను విడుదల చేసింది. తాము అధికారంలోకి వస్తే చట్టవిరుద్ధ కార్యకలాపాల (నిరోధక) చట్టం (యూఏపీఏ), మనీ లాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) లాంటి క్రూరమైన చట్టాలను రద్దు చేస్తామని, ఉపాధి హామీ పథకానికి నిధులు రెట్టింపు చేస్తామని హామీ ఇచ్చింది. కేంద్రంలో ప్రత్యామ్నాయ లౌకిక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి బీజేపీని ఓడించి తమను బలపరచాలని విజ్ఞప్తి చేసింది.

బీజేపీని శిక్షించాలని ప్రజల్ని కోరతాం: ఎస్కేఎం

చండీగఢ్: రైతులకు తీవ్ర అన్యాయం చేసిన బీజేపీని ఈ ఎన్నికల్లో శిక్షించాలని ప్రజలను కోరుతామని సంయుక్త కిసాన్ మోర్చా తెలిపింది. రైతు నాయకుడు బల్బీర్ సింగ్ రాజేవాల్ గురువారం మీడియాతో మాట్లాడుతూ రైతులపై నల్ల చట్టాలతో వారి అణచివేతకు ప్రయత్నించిన కేంద్రానికి బుద్ధి చెప్పాలని, అందుకే బీజేపీపై ఉద్యమాన్ని తీవ్రతరం చేయడానికి మే 21న పంజాబ్ జాగరణ్‌ను నిర్వహించనున్నట్టు చెప్పారు. 'బీజేపీని ఓడించండి..కార్పొరేట్లను తరిమికొట్టండి' అన్నది తమ నినాదమన్నారు. బీజేపీ తప్ప గెలిచే ఏ ఇతర అభ్యర్థికైనా ఓటు వేయాలన్నారు.

స్వతంత్రుల సత్తా ఏదీ?

1991 నుంచి 99 % మంది ఇండిపెండెంట్‌ల డిపాజిట్లు గల్లంతు

- 2019 ఎన్నికల్లో నలుగురే గెలుపు
- 1951లో 37 మంది స్వతంత్ర ఎంపీలు
- తెలంగాణలో ఇప్పటివరకు గెలిచింది ఒక్కరే



న్యూఢిల్లీ, ఏప్రిల్ 4: ఎన్నికల్లో గెలవాలంటే పార్టీల జెండాలు, గుర్తులే కాదు అభ్యర్థుల ఇమేజ్ కూడా చాలా ముఖ్యం. మన దేశంలో తొలినాళ్లలో పార్టీల కంటే అభ్యర్థుల బలాబలాల మీదనే గెలుపోటములు ఆధారపడి ఉండేవి. ప్రజల్లో మంచి పేరు ప్రఖ్యాతలు ఉన్న నేతలు స్వతంత్రులుగా బరిలో దిగినా ప్రజలు గెలిపించే వారు. అయితే, కాలక్రమంలో స్వతంత్రుల ప్రభావం తగ్గిపోయింది. 1951 – 52లో జరిగిన తొలి సార్వత్రిక ఎన్నికల్లో 533 మంది స్వతంత్ర అభ్యర్థులు పోటీ చేయగా 37 మంది విజయం సాధించారు. 2019లో జరిగిన 17వ సార్వత్రిక ఎన్నికల్లో దాదాపుగా 8 వేల మంది స్వతంత్ర అభ్యర్థులు పోటీ చేయగా కేవలం నలుగురు మాత్రమే విజయం సాధించారు.

అభ్యర్థులు ఎక్కువ.. గెలిచేది తక్కువ

దేశంలో స్వతంత్రంగా పోటీ చేసే అభ్యర్థుల సంఖ్య భారీగా పెరుగుతున్నప్పటికీ వీరిలో గెలిచే వారి సంఖ్య తగ్గుతూ వస్తున్నది. 1957 ఎన్నికల్లో 1,519 మంది స్వతంత్రులు పోటీ చేయగా 42 మంది విజయం సాధించారు. 1962లో విజయాన్ని అందుకుంది 20 మందే. ఇందిరా గాంధీ మరణం అనంతరం 1984 ఎన్నికల్లో కేవలం 13 మంది స్వతంత్రులే విజయం సాధించారు. 96 శాతం మంది డిపాజిట్లు కోల్పోయారు.

2019 ఎన్నికల్లో నలుగురే..

గత సార్వత్రిక ఎన్నికల్లో ఎనిమిది వేలకు పైగా స్వతంత్రులు ఎన్నికల బరిలో నిలిచారు. వీరిలో కేవలం నలుగురు మాత్రమే విజయం సాధించారు. 99.6 శాతం మంది డిపాజిట్లు కోల్పోయారు.

కర్ణాటకలో సుమలత అంబరీశ్, మహారాష్ట్రలో నవ్‌నీత్ రాణా, అస్సాంలో సరానియా, దాద్రా అండ్ నగర్ హవేలీ నుంచి మోహన్‌భాయ్ సంజిభాయ్ దేల్కర్ విజయం సాధించారు.

ప్రాంతీయ పార్టీల రాకతో...

గత కొన్ని దశాబ్దాలుగా స్వతంత్ర అభ్యర్థులపై ప్రజలకు నమ్మకం సన్నగిల్లుతున్నట్టు గెలిచిన వారు, డిపాజిట్ కోల్పోయిన వారి లెక్కలు చూస్తే స్పష్టమవుతున్నది. ఇక, ప్రాంతీయ పార్టీల ప్రభావం పెరగడం వల్ల కూడా ఇండిపెండెంట్ల సంఖ్య తగ్గిపోయిందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. గతంలో ప్రధాన రాజకీయ పార్టీల నుంచి టికెట్లు లభించని నేతలే స్వతంత్రులుగా ఎక్కువగా పోటీ చేసేవారు. ఇప్పుడు ప్రాంతీయ పార్టీలు ఏర్పడటం, వాటి ప్రభావం కూడా పెరగడం వల్ల టికెట్ ఆశించి భంగపడిన బలమైన నేతలకు ప్రాంతీయ పార్టీలు పిలిచి మరీ టికెట్ ఇస్తున్నాయి.

తెలంగాణలో ఒకే ఒక్కడు

తెలంగాణ విషయానికి వస్తే 17 సార్లు సార్వత్రిక ఎన్నికలు జరిగితే ఒకే ఒక్కరు స్వతంత్ర అభ్యర్థిగా లోక్‌సభకు ఎన్నికయ్యారు. 1967 ఎన్నికల్లో నిజామాబాద్ స్థానం నుంచి ఇండిపెండెంట్‌గా పోటీ చేసిన నారాయణరెడ్డి.. కాంగ్రెస్ అభ్యర్థి హరిశ్చంద్రపై 20,245 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. అంతకుముందు 1962 ఎన్నికల్లో ఇదే నారాయణరెడ్డి ఇండిపెండెంట్‌గా పోటీ చేసి హరిశ్చంద్రపై 27,020 ఓట్లతో ఓడిపోయారు. 1967 నుంచి ఇప్పటి వరకు తెలంగాణలో ఒక్కరు కూడా స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేసి లోక్‌సభకు ఎన్నికవలేదు.

గెలిచే వరకు తగ్గేదేలే!

ఓడినా పట్టు వదలని విక్రమార్కుల్లా పోటీ

ఎలక్షన్ కింగ్ పద్మరాజన్ సహా మరెందరో

న్యూఢిల్లీ, ఏప్రిల్ 4: ఎలక్షన్ కింగ్ కే పద్మరాజన్.. ఏ ఎన్నికైనా సరే తగ్గేదేలే అంటారాయన. గెలుపోటములతో సంబంధం లేదు.. పోటీ చేశామా? లేదా? అన్నదే ఆయనకు లెక్క. దేశంలో ఎక్కడ ఎన్నికలు జరిగినా అక్కడ ఓ నామినేషన్ వేయనిదే ఊరుకోరు. అలా ఇప్పటివరకు 238 నామినేషన్లు వేశారు. అయినా అన్ని ఎన్నికల్లోనూ ఓడిపోయారు. ఇందుకోసం డిపాజిట్లుగా మొత్తం రూ.80 లక్షలు పోగొట్టుకున్నారు. అయినా పట్టు వదలని విక్రమార్కుడిలా 239వసారి ఎన్నికల బరిలో నిలుస్తున్నారు. తమిళనాడులోని ధర్మపురి లోక్‌సభ స్థానం, కేరళలోని త్రిస్సూర్ నుంచి పోటీ చేస్తున్నారు. 1988 నుంచి పోటీ చేస్తున్న ఈయన.. 238 సార్లు ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయినందుకు లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు కూడా సంపాదించుకున్నారు. గిన్నిస్ బుక్ రికార్డు కోసం ప్రయత్నిస్తున్నట్టు వెల్లడించారు. ఈయన వాజపేయీ, పీవీ నరసింహారావు, మన్మోహన్ సింగ్, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తదితరులపై పోటీ చేశారు.

పద్మరాజన్‌లాగే ఇంకొందరూ..

ఇండోర్‌కు చెందిన పర్మానంద్ ఠొలానీ కూడా వరుసగా ఎన్నికల్లో పోటీ చేస్తూనే ఉన్నారు. ఈయన తండ్రి కూడా అనేక ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయారు. ఠొలానీ(65).. ఇప్పటి వరకు 18 ఎన్నికల్లో పోటీ చేశారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లోనూ పోటీ చేస్తానని స్పష్టం చేస్తున్నారు. పుణె వాసి విజయ్ ప్రకాశ్ కోడేకర్(78) కూడా 24 సార్లు ఎన్నికల్లో పోటీ చేసి ఓడారు.

300 ఎన్నికల్లో ఓటమి

పద్మరాజన్ కంటే ముందు ఉత్తరప్రదేశ్‌కు చెందిన కాకా జోగిందర్‌సింగ్ కూడా దాదాపు 300కు పైగా ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. ప్రతి సారి స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేయటం.. ఓడిపోవటం రివాజుగా మారింది. లక్షలాది రూపాయల డిపాజిట్ కోల్పోయినా ప్రయత్నం మానలేదు. జోగిందర్‌సింగ్ 1998లో చనిపోయారు.

ఒపీనియన్ పోల్‌లో ట్రంప్‌కే ఆధిక్యం

వాషింగ్టన్, ఏప్రిల్ 4: అమెరికా అధ్యక్షుడు జో బైడన్ పట్ల కీలక రాష్ట్రాల్లో ఓటర్లు చాలా అసంతృప్తిలో ఉన్నారు. వాల్‌స్ట్రీట్ జర్నల్ ఇటీవల నిర్వహించిన ఒపీనియన్ పోల్‌లో బైడన్ కన్నా డొనాల్డ్ ట్రంప్ ముందంజలో ఉన్నట్టు తేలింది. త్వరలో అమెరికా అధ్యక్ష పదవికి ఎన్నికలు జరుగనున్న సంగతి తెలిసిందే. ఏడు రాష్ట్రాల్లో సర్వే చేయగా ట్రంప్‌కు ఆధిక్యం లభించినట్టు సమాచారం. అధ్యక్ష ఎన్నికల్లో ఈ రాష్ట్రాలే కీలకమన్న అంచనాలున్నాయి. ఒక్క విస్కాన్సిన్ రాష్ట్రంలో మాత్రమే బైడన్‌కు ట్రంప్ కన్నా మూడు పాయింట్లు ఎక్కువగా వచ్చాయి.

3, 6 తరగతులకు కొత్త పుస్తకాలు

న్యూఢిల్లీ : పాఠశాల విద్యకు సంబంధించి ఎన్సీఈఆర్టీ కీలక ప్రకటన చేసింది. 2024–25 విద్యా సంవత్సరంలో 3, 6 తరగతులకు కొత్త సిలబస్‌తో కొత్త పాఠ్యపుస్తకాలను తీసుకొస్తున్నామని, మిగతా తరగతులకు ఎలాంటి మార్పులూ లేవని వెల్లడించింది. '3వ తరగతి పుస్తకాలను ఏప్రిల్ చివరి వారంలో, 6వ తరగతి పుస్తకాలను మే మధ్యలో విడుదల చేస్తాం. 4,5,9,11 తరగతులకు బఫర్ స్టాక్ సిద్ధంగా ఉంది. అన్ని తరగతుల డిజిటల్ కాపీలను ఎన్సీఈఆర్టీ పోర్టల్ సహా, పీఎం ఇ–విద్య, నేషనల్ డిజిటల్ లైబ్రరీ, దీక్ష నుంచి ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు' అని పేర్కొన్నది.

సీబీఎస్ఈ 11, 12 తరగతుల పరీక్ష తీరులో మార్పులు

న్యూఢిల్లీ: విద్యార్థుల సామర్థ్యాన్ని, యోగ్యతను పరీక్షించేలా సీబీఎస్ఈ 11, 12 తరగతుల పరీక్షల్లో మార్పులు చేస్తున్నట్టు సంబంధిత అధికారులు గురువారం వెల్లడించారు. పుస్తక జ్ఞానాన్ని నిజ జీవిత పరిస్థితులకు అన్వయిస్తూ ప్రశ్నలుంటాయని, ఇందుకు సంబంధించిన ప్రశ్నల సంఖ్య పెంచామని సీబీఎస్ఈ అధికారులు తెలిపారు. కొత్త ఫార్మాట్‌లోని పరీక్షలు 2024–25 విద్యా సంవత్సరం నుంచి అమల్లోకి వస్తాయన్నారు. ఇక 9, 10 తరగతుల పరీక్షల తీరులో ఎలాంటి మార్పులూ లేవన్నారు.

క్యాన్సర్‌కు దివ్యౌషధం

మొదటిపేజీ తరువాయి...

పదో వంతుతోనే భారత్‌లోని క్యాన్సర్ బాధితులకు సీఏఆర్ టీ–సెల్ థెరపీ అందించవచ్చని తెలిపారు. జెనెటిక్ ఇంజినీరింగ్, క్యాన్సర్ చికిత్సలో ఇది చారిత్రక మైలురాయని పేర్కొన్నారు. ఇది ఎంతో డబ్బుని, ఎన్నో ప్రాణాలను కాపాడబోతున్నదని, కన్నీటిని దూరం చేయబోతున్నదని తెలిపారు.

విదేశాల్లో సుమారు రూ.4 కోట్ల ఖర్చు

దశాబ్దాలుగా మానవాళికి సవాల్‌గా మారిన క్యాన్సర్ వ్యాధికి మొదట సర్జరీ, ఆ తర్వాత కీమోథెరపీ, రెడియేషన్ థెరపీ వంటి చికిత్సలు అందుబాటులోకి వచ్చాయి. తర్వాతి కాలంలో శాస్త్రవేత్తలు సీఏఆర్ టీ–సెల్ థెరపీని అభివృద్ధి చేశారు. 2017లో ఈ చికిత్సకు అమెరికాలోని ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్(ఎఫ్‌డీఏ) ఆమోదించింది. క్యాన్సర్ చికిత్సలో దీని పనితీరు బాగుందని వైద్యులు శాస్త్రీయంగా గుర్తించడంతో మొదట అమెరికాలో ఆ తర్వాత పలు దేశాల్లో ఈ చికిత్స అందుబాటులోకి వచ్చింది. అయితే, ఈ చికిత్స ఖర్చు భారీగా ఉండటం వల్ల అందరూ చేయించుకోలేకపోయారు. ప్రస్తుతం అమెరికాలో ఈ చికిత్సకు దాదాపు రూ.4 కోట్లు ఖర్చు అవుతున్నది. ఇప్పుడు భారత్‌లో దేశీయంగా ఈ చికిత్సను అభివృద్ధి చేసి అందుబాటులోకి తేవడంతో ఈ ఖర్చు గణనీయంగా తగ్గిపోనున్నది.

సీఏఆర్ టీ-సెల్ థెరపీ అంటే?

సీఏఆర్ టీ–సెల్ థెరపీ అంటే చిమెరిక్ యాంటిజెన్ రిసెప్టార్ టీ–సెల్ థెరపీ. ఒక రకంగా చెప్పాలంటే క్యాన్సర్ రోగులకు సజీవమైన ఔషధాన్ని అందించే చికిత్స ఇది. ఐదు దశల్లో ఈ చికిత్స ఉంటుంది. ముందుగా రోగి రక్తాన్ని సేకరించి అందులో నుంచి టీ–సెల్స్‌ను వేరు చేస్తారు. ల్యాబ్‌లో ఈ టీ–సెల్స్‌లోకి సీఏఆర్ అనే క్యాన్సర్‌తో పోరాడే జన్యువును చొప్పిస్తారు. మూడో దశలో ల్యాబ్‌లోనే సీఏఆర్‌తో కూడిన టీ–సెల్స్‌ను కోట్ల సంఖ్యలో అభివృద్ధి చేస్తారు. ఆ తర్వాత ఈ సీఏఆర్ టీ–సెల్స్‌ను మళ్లీ రోగి రక్తంలోకి పంపిస్తారు. ఈ టీ–సెల్స్ శరీరంలోని క్యాన్సర్ కణాలను గుర్తించి అంతం చేస్తాయి. సీఏఆర్ టీ–సెల్ థెరపీ తీసుకునే వారిలో సైడ్ ఎఫెక్ట్స్ ఉన్నప్పటికీ క్యాన్సర్ చికిత్సలో దీని సామర్థ్యం బాగుంటుందని వైద్యులు చెప్తున్నారు.

ఐఐటీ బాంబే గ్రాడ్యుయేట్స్‌లో 36% మందికి నో జాబ్స్!

న్యూఢిల్లీ: జాబ్ మార్కెట్ సంక్లిష్ట పరిస్థితుల్లో ఉందని చెప్పడానికి ఇదే ఉదాహరణ. ఐఐటీ బాంబే నుంచి లేటెస్ట్‌గా వచ్చిన గ్రాడ్యుయేట్లలో 36 శాతం మందికి ఉద్యోగాలు లేవు! 2024వ సంవత్సరంలో ప్లేస్‌మెంట్స్ కోసం దాదాపు 2,000 మంది నమోదు చేయించుకున్నారు. వీరిలో 712 మందికి ఇంకా ఉద్యోగాలు రాలేదు. ఈ కథనాలపై ఐఐటీ–బాంబే స్పందిస్తూ ప్లేస్‌మెంట్ ప్రాసెస్‌లో 57.1 శాతం మంది ఉద్యోగాలు పొందినట్లు తెలిపింది. 12.2 శాతం మంది ఉన్నత విద్యాభ్యాసానికి వెళ్లారని, 8.3 శాతం మంది పబ్లిక్ సర్వీస్‌లో కెరీర్స్‌ను ఎంపిక చేసుకున్నారని చెప్పింది. 10.9 శాతం మంది ఐఐటీ–బాంబేకు వెలుపల ఉద్యోగాలు పొందారని, 1.6 శాతం మంది స్టార్టప్‌లను ప్రారంభించారని, కేవలం 4.3 శాతం మంది మాత్రమే తమ కెరీర్ గురించి ఎటువంటి నిర్ణయాలు తీసుకోలేకపోతున్నారని వివరించింది.

కొవిడ్ కంటే 100 రెట్లు ప్రాణాంతకం!

ముంచుకొస్తున్న బర్డ్‌ఫ్లూ ముప్పు

హెచ్5ఎన్1పై నిపుణుల ఆందోళన

లండన్: కరోనా కంటే ప్రాణాంతకమైన బర్డ్‌ఫ్లూ మానవాళిపై విరుచుకుపడే ప్రమాదం ఉన్నదని పలువురు నిపుణులు ఆందోళన వ్యక్తం చేశారు. బర్డ్‌ఫ్లూలోని హెచ్5ఎన్1 రకం వైరస్ మహమ్మారిగా మారవచ్చని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి 'డెయిలీ మెయిల్'లో ఒక కథనం ప్రచురితమైంది. ఈ బర్డ్‌ఫ్లూకు మానవాళి చేరువవుతున్నదని, ఈ వైరస్ మనుషులతో పాటు జంతువులకు కూడా వ్యాపించవచ్చని అమెరికాలోని పిట్స్‌బర్గ్‌కు చెందిన బర్డ్‌ఫ్లూ పరిశోధకులు డాక్టర్ సురేశ్ కూచిపూడి పేర్కొన్నారు. ఇదేదో కొత్తగా పుట్టుకొచ్చే వైరస్ కాదని, ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా ఉన్నదేనని తెలిపారు. దీనిని ఎదుర్కొనేందుకు వెంటనే సిద్ధం కావాల్సి ఉందన్నారు. కెనడాకు చెందిన ఫార్మారంగ నిపుణులు జాన్ ఫౌల్టన్ కూడా బర్డ్‌ఫ్లూపై ఆందోళన వ్యక్తం చేశారు. హెచ్5ఎన్1 వేరియంట్ మహమ్మారిగా మారవచ్చని, ఇది కొవిడ్–19 కంటే 100 రెట్లు ప్రాణాంతకం కావొచ్చని తెలిపారు.

మృత్యుంజయుడు

విజయపుర, ఏప్రిల్ 4: కర్ణాటకలోని విజయపుర జిల్లా లచ్యన గ్రామంలో బోరుబావిలో పడ్డ చిన్నారి సాత్విక్ సతీశ్ ముజగోడ్(2)ని రెస్క్యూ సిబ్బంది 20 గంటలపాటు శ్రమించి రక్షించారు. అతడిని వెంటనే సమీపంలోని దవాఖానకు తరలించారు. బాలుడి ఒంటిపై గాయాలేమీ కనిపించలేదు. దీంతో అతడి తల్లిదండ్రుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. బుధవారం సాయంత్రం బాలుడు ఆడుకుంటూ బోరు బావిలో పడిపోయాడు. బాలుడిని రక్షించడానికి బోరు బావి పక్కనే అడ్డంగా, నిలువుగా గోతులు తవ్విన సహాయ సిబ్బంది.. 20 గంటలు శ్రమించి కాపాడింది. ప్రాణాలతో బయటపడ్డ చిన్నారికి సిద్ధలింగ మృత్యుంజయ అని కొత్త పేరు పెట్టారు.

నిశీథిలోనూ సూపర్ సక్సెస్

అగ్నిప్రైమ్ క్షిపణి పరీక్ష విజయవంతం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 4: అణ్వస్త్ర సామర్థ్యం కలిగిన నూతన శ్రేణి బాలిస్టిక్ క్షిపణి 'అగ్ని ప్రైమ్'ను రాత్రివేళ భారత్ విజయవంతంగా పరీక్షించింది. ఒడిశా తీరంలోని అబ్దుల్ కలాం దీవి నుంచి బుధవారం దీన్ని ప్రయోగించింది. భారత రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో), స్ట్రాటెజిక్ ఫోర్సెస్ కమాండ్ (ఎస్ఎఫ్‌సీ) సంయుక్తంగా దీన్ని నిర్వహించాయి. ఈ క్షిపణి 1000–2000 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేదించగలదు. గత నెలలో మిషన్ దివ్యాస్త్రలో భాగంగా ఎంఐఆర్‌వీ ఆధారిత అగ్ని–5 క్షిపణిని భారత్ విజయవంతంగా పరీక్షించిన విషయం తెలిసిందే. తద్వారా ఎంఐఆర్‌వీ సాంకేతికత కలిగిన అగ్రదేశాల సరసన భారత్ నిలిచింది.

భూకంపానికి చెదరని ఆకాశహర్మ్యం

తైపీ, ఏప్రిల్ 4: తైవాన్ రాజధాని తైపీలోని 101 అంతస్థుల భవ